క్లుప్తంగా

వైభవంగా సోమేశ్వరుడి కల్యాణం


సోమేశ్వరుని కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కాళ్ల: స్థానిక శ్రీగంగాపార్వతి సమేత సోమేశ్వర స్వామి వార్షిక కల్యాణ మహోత్సవం కార్యక్రమం శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన గనిశెట్టి శ్రీనివాసరావు, శ్రీదేవితులసిప్రభ దంపతులతో వేద పండితులు వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణాన్ని చేశారు. అధిక సంఖ్యలో భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. అనంతరం ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు. డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్యాల వెంకటేశ్వరరావు (రత్నం) దంపతులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ వేగేశ్న ఆంజనేయరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఉచిత మెడికల్ క్యాంపు


ఉచిత మెడికల్ క్యాంపులో వైద్య సేవలు అందజేస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణంలో బ్రీత్ ఆఫ్ లైఫ్ మినిస్ట్రీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భీమవరం ప్రకాష్ నగర్‌లోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉచిత వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈశిబిరంలో క్యాంపులో డాక్టర్ ఎం గోవింద్‌బాబు, డాక్టర్ పి.లక్ష్మి మోనిక, డాక్టర్ ఎస్.కృష్ణదుర్గ తదితర రోగులకు పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితం మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్‌కుమార్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ యేలేటి న్యూటన్, ట్రస్ట్ చైర్మన్ బత్తుల విజయకుమార్, వైస్ చైర్మన్ గంటా బేబిమాబెల్, గంటా సుందర్‌కుమార్, రాజ్‌కుమార్, క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజీమార్గమే రాజమార్గం


లోక్ అదాలత్‌లో కక్షిదారులతో మాట్లాడుతున్న న్యాయమూర్తులు

భీమవరం(ప్రకాశం చౌక్): కేసుల పరిష్కారంలో రాజీమార్గమే రాజమార్గమని భీమవరం మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో సంస్థ చైర్మన్, 3వ అదనపు జిల్లా జడ్జి డా.బి.లక్ష్మినారాయణ తెలిపారు. భీమవరం కోర్టులో జాతీయ లోక్ అదాలత్ శనివారం జరిగింది. ఈ సందర్భంగా కక్షిదారులకు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. గ్రామాల్లో చిన్నచిన్న వివాదాలకు కోర్టులు చుట్టూ తిరుగుతూ సమయం, డబ్బు వృథా చేసుకోకుండా అదాలత్‌ల ద్వారా కేసుల పరిష్కారం ఉత్తమ మార్గమని తెలిపారు. మొత్తం 347 కేసులను పరిష్కరించారు. న్యాయ మూర్తులు ఎం.సుధారాణి, డి.ధనరాజు, న్యాయవాదులు, న్యాయ సేవాధిక సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి బొండాడలో జాతర

కాళ్ల: మండలంలోని బొండాడ గ్రామంలో ఉన్న గ్రామ దేవతలు శ్రీ పోలేరమ్మ, శ్రీ మహాలక్ష్మమ్మ అమ్మవార్ల 50వ వార్షిక జాతర మహోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయని జాతర కమిటీ సభ్యులు చెప్పారు. శనివారం ఆలయ ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 16వ తేదీ వరకు జాతర నిర్వహిస్తామని స్పష్టం చేశారు. 19న ఆలయ ఆవరణలో అన్నసమారాధన ఏర్పాటు చేశామన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

వీరవాసరం: ఇటీవల రాయకుదురులో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన తోట రాంపండు కుటుంబానికి శ్రీకృష్ణదేవరాయ కాపు తెలగా సంఘ సభ్యులు అండగా నిలిచారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణదేవరాయ కాపు తెలగా సంఘసభ్యులు సేకరించిన రూ.1,13,500 నగదును శనివారం బాధితులకు అందజేశారు. మంచి కార్యక్రమాన్ని ముందుండి నడిపించిన సంఘ సభ్యులందరికి పలువురు గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు.

రేపటి నుంచి పీజీఆర్ఎస్ ప్రారంభం

పాలకొల్లు సెంట్రల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) సోమవారం నుంచి యథావిధిగా జరుగుతుందని ఆర్డీఓ దాసి రాజు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావేదిక ఎన్నికల కోడ్ వల్ల నిలుపుదల చేయగా కోడ్ ముగియడంతో యథాప్రకారం ప్రతి సోమవారం ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం


ఉండి: సుబ్బారావు దంపతులను సత్కరిస్తున్న మహిళా ప్రజాప్రతినిధులు, నాయకులు


వీరవాసరం: రాయకుదురులో మహిళా దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): సమాజ ప్రగతిలో అతివల పాత్ర కీలకమని పలువురు వక్తలు తెలిపారు. శనివారం ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సభకు యూనియన్ జోనల్ నాయకురాలు బి.అరుణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ వి రావు, రీజినల్ కార్యదర్శి అల్లం సత్యనారాయణ, ఎంవి ఎల్ కుమారి, సత్యవేణి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం సీతారాం ప్రసాద్, ప్రజానాట్యమండలి నాయకులు చాంద్ బాషా తదితరులు పాల్గొన్నారు. మహిళ అభివృద్ధి చెందితే ఆ కుటుంబంతో పాటు సమాజం కూడా అభివృద్ధి చెందుతుందని ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెల్లబోయిన రంగారావు అన్నారు. మహిళా దినోత్సవం పురస్కరించుకొని శనివారం ప్రభుత్వాసుపత్రి పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.రమాదేవి, ఝాన్సీ, మాధవి, కల్యాణి, ముత్యాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

వీరవాసరంలో..

వీరవాసరం: మండలంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. సరోజినీ నాయుడు, రాణి రుద్రమదేవి, ఆంధ్ర అన్నపూర్ణ డొక్కా సీతమ్మ, వీరనారి ఝాన్సీ లక్ష్మి బాయి వంటి మహోన్నత మూర్తుల వీర గాధలను వక్తలు తెలియజేశారు. మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో వీరవల్లి దుర్గ భవానీ, గెడ్డం భారతి, చిక్కిలే మంగతాయారు, దాసరి మహాలక్ష్మి ,పాల లక్ష్మి కుమారి, బోను జోష్ణదేవి, నాగరాజు పద్మకళ, వీరవల్లి కుసుమకుమారి, గుల్లిపల్లి విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు ,ఆశా కార్యకర్తలు, డ్వాక్రా ఏఎస్ఎం సిబ్బంది, పలువురు పాల్గొన్నారు.

ఉండిలో..

ఉండి: ఎక్కడైతే మహిళను గౌరవిస్తారో అక్కడ సుఖ సంతోషాలు ఉంటాయని జెడ్పీటీసీ సభ్యురాలు రణస్తుల కనకదుర్గ, ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గుండాబత్తుల సుబ్బారావు, హేమలత దంపతుల ఆధ్వర్యంలో ఉండిలో మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పొరెళ్ల కామేశ్వరీ, ఇంటి విజయలక్ష్మి, అవ్వమ్మ, డీలర్ విప్పర్తి ప్రిస్కిల్లా, సోషల్ వర్కర్ గాదిరాజు అలేఖ్య, ఆశా వర్కర్ దుగ్గిరాజు దుర్గాభవాని తదితరులను సత్కరించారు. అలాగే అనేక ఏళ్ల నుంచి మహిళలను సత్కరిస్తూ వారి కోసం సొంత ఖర్చుతో మహిళా దినోత్సవాన్ని నిర్వహిస్తున్న గుండాబత్తుల సుబ్బారావు, హేమలత దంపతులను మహిళా నాయకులు సాదరంగా సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహకులు మాట్లాడుతూ మహిళకు కుటుంబంలోను, సమాజంలోను సముచిత స్థానం ఇవ్వాలని అన్నారు. సుబ్బారావు దంపతులు మాట్లాడుతూ ఉండి బస్టాండ్ వద్ద ఉన్న క్యాంప్‌బెల్ సత్రానికి ఉండికి చెందిన స్వాతంత్ర్య సమరయోధురాలు తల్లాప్రగడ విశ్వసుందరి పేరు పెట్టాలని కోరారు. కార్యక్రమంలో అళగిరి రజనీ, ఆకివీడు ఎంపీటీసీ సభ్యురాలు మోరా జ్యోతి, కొత్రపాటి అనిత, బందెల ప్రమీల, బేతాళ పుష్ప, మంతెన త్రివేణి, దండు శ్రీదేవి, గలావిల్లి ధనుంజయ, గులిపల్లి అచ్చారావు, తాటిపట్టి పెద వీరప్ప, వాసుపల్లి విజయ్‌కుమార్, రాయి సతీష్, శేషాద్రి శ్రీను తదితరులు పాల్గొన్నారు.


కాళ్ల: సీసలి సచివాలయంలో కేక్ కట్ చేస్తున్న సర్పంచ్ దంపతులు


ఆకివీడు: ఉత్తమ ఉద్యోగినిగా కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న ఏఓ ప్రియాంక

సీసలిలో..

కాళ్ల: మండలంలోని సీసలి సచివాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ బిళ్ళకుర్తి ధనలక్ష్మి దంపతులు కేకుకట్ చేసి సచివాలయ సిబ్బందికి పంచారు.ఉండి వాటర్ డీసీ చైర్మన్ తోట ఫణిబాబు వివిధ ప్రభుత్వ శాఖల మహిళా ఉద్యోగులు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు జి.మంగతాయారు, పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ, తోట హరిబాబు, రామదాసు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు అవార్డులు

ఆకివీడు: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండలంలోని ఇద్దరు మహిళా ఉద్యోగులకు జిల్లా స్థాయి ఉత్తమ మహిళా అవార్డులను శనివారం భీమవరంలో జిల్లా కలెక్టర్ నాగరాణి చేతుల మీదుగా అందుకున్నారు. మండల వ్యవసాయాధికారిణిగా పనిచేస్తున్న ఎమ్మార్పీ ప్రియాంక, మండల వెటర్నరీ అధికారి, అసిస్టెంట్ సర్జన్ కెల్లా భార్గవీ సత్య అవార్డులను అందుకున్నారు. రైతులకు, పాడి రైతులకు విశిష్ట సేవలందిస్తూ రైతుల మన్ననలు పొందిన మహిళా అధికారిణులకు ఉత్తమ అవార్డులు రావడం అభినందనీయమని పలువురు రైతులు పేర్కొన్నారు.

ఆర్థిక సాయం అందజేత


రాంప్రసాద్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశం చౌక్): ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం కనీస ధర్మమని, తోటివారికి సహాయం చేయడంలోనే తృప్తి ఉంటుందని ప్రముఖ వైద్యులు డాక్టర్ పాలకోడేటి నిరుపమ అన్నారు. శనివారం భీమవరం ఫాల్కన్ నెస్ట్‌లో దేవతిలకుల మహిళా సమాఖ్య ఉపాధ్యక్షురాలు కాలపు సాయిలక్ష్మి ఆధ్వర్యంలో మహిళ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గుండె జబ్బుతో బాధపడుతున్న రాంప్రసాద్ కుటుంబ సభ్యులకు రూ.1.20లక్షల ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నిరుపమ మాట్లాడుతూ మహిళలు సమాజ సేవలో కూడా పాలు పంచుకోవడం గొప్ప విశేషమన్నారు. మహిళలు అన్ని రంగాల్లోనూ ముందు ఉంటున్నారని చెప్పడానికి ఈసేవలే నిదర్శనమన్నారు. గత మూడేళ్లుగా దేవతిలకుల సమాఖ్య సభ్యులు చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ఈకార్యక్రమంలో దేవతిలకుల మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

విష్ణులో ముగిసిన టెక్నోవా 2025

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణంలోని విష్ణు ఇంజినీరింగ్ మహిళా కళాశాలలో జాతీయస్థాయి మహిళా సాంకేతిక సదస్సు 'టెక్నోవా 2025' ముగింపు ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జి. శ్రీనివాసరావు విద్యార్థినులకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థినులు తమ సొంత ఆలోచనలతో విజయ పథాన్ని నిర్మించుకోవాలన్నారు. సాంకేతిక సదస్సులు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా మహిళా దినోత్సవం సందర్భంగా పలువురు మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ అఫైర్స్ అడ్మిన్ డైరెక్టర్ పి. శ్రీనివాసరాజు, సదస్సు కన్వీనర్ పి. కిరణ్ శ్రీ పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణకు చర్యలు

గ్రామాల్లో పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది


కాలి గిట్టల వద్ద గాలికుంటు వ్యాధి


పశువుల నోటిలో ఏర్పడిన పుండ్లు

పాలకొల్లు సెంట్రల్: పశువులకు వచ్చే ఎఫ్ఎండీ (ఫుడ్ అండ్ మౌత్ డిసీస్) గాలికుంటు వ్యాధి సోకకుండా రైతులు ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా పశువులకు ఓఖని టీకాలు వేయించాలి. ఈ వ్యాధి ప్రాణాంతకం కాకపోయినా అశ్రద్ధ వహిస్తే మాత్రం పశువులు నెమ్మదిగా క్షీణించిపోయే ప్రమాదం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఈ వ్యాధి వైరస్ ద్వారా వస్తుంది. చాలా వేగంగా సోకు తుంది. గాలి, నీరు, దాణా, మనుషుల ద్వారా కూడా వ్యాపించే గుణం ఉంటుంది. గాలికుంటు వ్యాధి సోకితే పశువులకు 103 నుండి 106 జ్వరం వస్తుంది. నోటిలో పుండ్లు, కాలి గిట్టల్లో పుండ్లు ఏర్పడతాయి. నోటి నుంచి చొంగ కారుతుంది. దానివల్ల అవి ఆహారాన్ని తినే పరిస్థితి కూడా ఉండదు. ఈ వ్యాధిపై అశ్రద్ధ వహిస్తే మరింత ముదిరిపోతుంది. వ్యాధి ముదిరితే ఉత్పాదక శక్తి తగ్గిపోతుంది. దీనిని అరికట్టడం కోసం సంవత్సరానికి రెండు పర్యాయాలు టీకాలు వేయించాలి.

గాలికుంటు వ్యాధి నివారణ ఇలా

గాలికుంటు వ్యాధి నివారణకు పశువులకు సకాలంలో టీకాలు వేయించాలి. మూడు నెలలు దాటిన అన్ని పశువులకు ఈ టీకాలు వేయవచ్చు. చూడితో ఉన్న పశువులకుసైతం ఈ టీకాలు వేయించవచ్చు. వ్యాధి సోకిన వెంటనే పెయిన్ కిల్లర్లు, బి కాంప్లెక్స్ ఇంజక్షన్‌లు ఇవ్వాలి. నోటిలో పుండ్లు ఏర్పడడం వల్ల మేత తినలేక ఇబ్బందులు పడుతుంటాయి. అందువల్ల అంబలి, జొన్నలతో జావ కాసి పట్టించాలి. వ్యాధి సోకిన వాటిని పశువుల మంద నుంచి దూరంగా ఉంచాలి. వాటి పాల నుంచి దూడలను దూరంగా ఉంచాలి. అలాగే పసుపు, మంచి నూనె కలిపి ముద్దలుగా చేసి నోటిలో పుండ్లు ఏర్పడిన చోట రుద్దాలి. ఈ వ్యాధి వల్ల పాల ఉత్పత్తి తగ్గిపోయే ప్రమాదం ఉంటుంది. అందువల్ల రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వ్యాక్సిన్‌లు వేయించాలి.

31 వరకు వ్యాక్సినేషన్



పశువులకు వ్యాక్సిన్ మార్చి 31 వరకూ వేస్తున్నాం. రైతు వారి పశువులకు అయితే రైతులు శ్రద్ధ తీసుకుంటారు. వీధి పశువులకు ఎవ్వరూ పట్టించుకునే పరిస్థితి ఉండదు. అందువల్ల ఈ నెలాఖరు వరకూ వీధి పశువులకు టీకాలు వేస్తాం. ప్రతి సంవత్సరం టీకాలు మార్చి, సెప్టెంబర్ నెలల్లో రెండు డోసులు వేయించాలి.
– డాక్టర్ జి.మల్లేశ్వరరావు, సహాయ సంచాలకులు ప్రాంతీయ పశువైద్యశాల, పాలకొల్లు

ఆక్వా సాగుతో నీటి కష్టాలు

- డ్రెయిన్‌లుగా మారిపోతున్న పంట కాలువలు
- తాగునీటికి కటకటలాడిపోతున్న ప్రజలు


ఉండి-అర్తమూరు పంట కాలువ దుస్థితి


పసర్లు పట్టి రంగుమారిన అర్తమూరు పంట కాలువ

ఉండి: ఆక్వా సాగుకు అధికారులు దాసోహం అంటున్నారు. ఎలాంటి అనుమతులు లేకపోయినా ఇష్టానుసారం చెరువలను తవ్వేయడం వల్ల నియోజకవర్గంలో తాగునీటి వనరులు వేసవి కాలానికి ముందే అడుగంటుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో నీరు ఉన్నా దేనికీ పనికిరాకుండా పోతుంది. చివరకు పశువులు కూడా పంట కాలువల్లో నీటిని తాగడం లేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఎవరు ఎలా పోతే మాకేంటి? మాది మాకు అందిందా? లేదా? అన్నట్లు వివిధ శాఖల అధికారులు వ్యవహరిస్తున్నారు. ఓ వైపు తప్పు మీదంటే మీదంటూ అధికారులు ఒకరిపై ఒకరు నెట్టుకుంటూ చేతులు దులిపేసుకుంటున్నారు. అధికారుల తీరు వల్ల పంటకాలువలు కాస్త మురుగు డ్రెయిన్‌లుగా మారిపోతున్నాయి. ప్రధాన గ్రామాల కంటే శివారు గ్రామాలు,శివారు ప్రాంతాల ప్రజలు తాగునీటికి కటకటలాడుతున్నారు.

ఉండి-అర్తమూరు కాలువ దుస్థితి ఇదీ

ఉండి-అర్తమూరు పంట కాలువ పరిధిలో వందల ఎకరాలు వరి, ఆక్వా సాగులో జరుగుతుంది. అయితే గతంలో ఈ కాలువ నీరే ఉండి శివారు ఉప్పుగుంట, అర్తమూరు గ్రామాల ప్రజలతో పాటు వ్యవసాయ పనులకు వచ్చే కూలీలకు అమృతంలా ఉండేది. కానీ ఇప్పుడు ఈ కాలువలోని నీరు పూర్తిగా విషంగా మారిపోయింది. కారణం ఆక్వా చెరువుల వ్యర్థాలు నేరుగా పంటకాలువలోకి విడుదల చేయడంతో తాగునీరు కాస్త వాడకానికి కూడా పనికిరాకుండా పోతుంది. ఉండి నుంచి సుమారు రెండు కి.మీ దూరంలో ఉన్న ఉండి శివారు ప్రాంతం ఉప్పుగుంటలో వాడకానికి నీరు లేకుండా పోతుంది. ఉన్న ఒక్క వాడకం చెరువు కూడా మురుగుతోనూ, పసర్లతోను నిండిపోయింది.అంతే కాకుండా మరో 500 మీటర్లు అర్తమూరు వైపునకు వెళితే పంటకాలువ కాస్త నమ్మలేనంతగా డ్రెయిన్‌కంటే దారుణంగా మారిపోయింది. పంటకాలువ గుర్రపుడెక్కతో నిండడమే కాకుండా ఆక్వా వ్యర్థాలతో దుర్వాసన వస్తుందని స్థానికులు వాపోతున్నారు. ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా వారెవ్వరూ పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. ఆక్వా చెరువుల వల్ల తమ ఆరోగ్యాలు నాశనం అవుతున్నా ఒక్క అధికారి కూడా పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. అలాగే మండలంలో వెలివర్రు కాలువ, పాములపర్రు కాలువ, కలిగొట్ల కాలువ, చిలుకూరు కాలువ, అర్తమూరు కాలువ తదితర పంటకాలువలు పూర్తిస్థాయిలో ఆక్వా వ్యర్థాల వల్ల నీటి కాలుష్యంతో నాశనం అవుతున్నాయి.ఈ వేసవిలో ఆయా కాలువల పరిధిలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడం ఖాయంగా కనబడుతుంది.

హడావుడికే పరిమితం

గతంలో డీసీ చైర్మన్ తోట ఫణి, వైస్ చైర్మన్ మంతెన సాయిలచ్చిరాజు అర్తమూరు పంటకాలువ వెంబడి ఉన్న ఆక్రమణలు తొలగించి, భారీ ఎత్తున ప్రచారం కూడా చేసుకున్నారు. ఇరిగేషన్, మత్స్యశాఖ, రెవెన్యూ అధికారులను పిలిచి మరీ పంచాయితీ పెట్టారు. వారికి ఆదేశాలిచ్చి పంటకాలువకు వేసిన అడ్డగట్లు, కాలువగట్లు ఆక్రమించుకుని వేసిన షెడ్లు, చెరువుల కోసం అక్రమంగా వేసిన బోర్లు వెంటనే తొలగించాలని హుకుం జారీ చేశారు. కానీ క్షేత్రస్థాయిలో ఇప్పటివరకు ఏదీ అమలు జరగలేదు. అధికారులు ఫొటోలకే పరిమితమవుతున్నారని ప్రజలు చెబుతున్నారు. వారు క్షేత్రస్థాయి పరిశీలన లేకుండా ఆక్వా చెరువులకు అనుమతులిస్తున్నారని మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చుక్క నీరు పనికి రావడం లేదు



మాది ఉండి శివారు ప్రాంతం ఉప్పుగుంట. గతంలో ఉండి అర్తమూరు కాలువలో నీటిని తాగేవాళ్ళం. వ్యక్తిగత అవసరాలకు వాడుకునే వాళ్లం. కానీ ఇప్పుడు ఈ నీరు ముట్టుకునేందుకు కూడా భయంగా ఉంటుంది. రంగుమారిపోవడమే కాకుండా దుర్వాసన వస్తుంది. ఈ సమస్యను ఎవరూ పట్టించుకోవడం లేదు. – వల్లూరి ప్రమీల, ఉప్పుగుంట, ఉండి

ఎవరూ పట్టించుకోవడం లేదు



అర్తమూరు పంటకాలువ గురించి ఇప్పటికే చాలా మందికి చెప్పాం. ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదు. మేమంటే అందరికీ అలుసే. పంచాయతీ వారు ఇచ్చే కుళాయి నీరే మాకు దిక్కవుతుంది. ఇతర అవసరాలకు మేం చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పుడైనా అధికారులు మాపై దయచూపాలి. – దండి ప్రకాశం,ఉప్పుగుంట,ఉండి